క్లుప్తంగా

గురుకులంలో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: కొనకనమిట్ల మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎస్సీ కేటగిరిలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులో ఎస్సీ కేటగిరిలో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్.ఇబ్రహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కేటగిరిలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్ కార్డుతో వెలుగొండ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతిని అరికట్టండి

దర్శి: ఉపాధి హామీ పనుల్లో జరిగే అవినీతిని అరికట్టాలని జన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తెనాలి రవిబాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనికి వచ్చే కూలీల దగ్గర నుంచి రోజుకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ నగదు అంతా ఎవరి జేబుల్లోకి వెళుతుందో తేల్చాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జునస్వామికి పూజలు చేశారు.

జాషువా వర్ధంతి సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

దర్శి: గుర్రం జాషువా వర్ధంతి సభను జయప్రదం చేయాలని దళిత సేన అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ కోరారు. ఈ నెల 24న జరగనున్న గుర్రం జాషువా వర్ధంతి వేడులకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న కవులు, పద్యాలు ఆలపించే కళాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పద్యాలు ఆలపించే కళాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ వైవిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బట్టు రామారావు, సంఘసేవకులు జీవీ రత్నం, పిట్ట రమేష్, బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు 'కోట'కు ఘన నివాళి

మార్కాపురం: విలక్షణ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికి తీరని లోటని బ్రాహ్మణ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక శివాలయం వద్ద ఆదివారం కోట శ్రీనివాసరావు చిత్రపటానికి జగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ పురోహిత, అర్చక, రుత్విక్కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అటు సినీ రంగం, ఇటు రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలను సంఘ నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీధర సుబ్బు, ఆంజనేయ శర్మ, వరుణ్‌తేజ, పి.శివకుమార్, కె.ప్రసాద్ శాస్త్రి, ఓరుగంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందాల్సిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సోమవారం ఉదయం 9 గంటలకు అర్ధవీడు గురుకులంలో సంప్రదించాలని సూచించారు.

సరస్వతి నిలయంలో సమస్యల తిష్ట

- రక్షణ గోడ లేక ఇబ్బందులు
- చినుకు పడితే చిత్తడే
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు

పెద్దారవీడు:

ఏదో రికార్డు సృష్టించడానికి పేరెంట్స్ మీటింగ్ పెట్టారే తప్పా.. సమస్యల గురించి చర్చించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నామని చెపుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అవేవి కానరావడం లేదు. ఇందుకు నిదర్శనం మండలంలో ఏనుగులదిన్నెపాడు పంచాయతీ కర్రోల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక (ఆదర్శ) పాఠశాలే ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. పాఠశాలలో విద్యార్థులు బాగానే ఉన్నా మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ఆవరణలో కుక్కలు, పందులు, కోళ్లు సంచరిస్తున్నాయి. పాఠశాల ఆవరణంలో చిన్న చిన్న గుంతలు ఉండటంతో చినుకు పడితే బురదమయంగా మారుతుంది. రోజుల కొద్ది మురుగు నీరు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మధ్యాహ్నం పూట భోజనం చేయాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గోడ లేకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం తినే సమయంలో కుక్కలు రావడంతో ఎక్కడ కరుస్తాయోనని భయంగా ఉందని వాపోతున్నారు.

గ్రామం అంతా అపరిశుభ్రం..

గ్రామంలో కొద్దిపాటి వర్షం కురిసినా పాఠశాల ముందే వర్షపు నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారుతోంది. వర్షం నీరు నిల్వ ఉండి బురదతో రోజుల తరబడి ఉండటంతో ఆటలకు ఆటంకం కలిగిస్తోంది. ఆటలు ఆడుకొనేటప్పుడు జారి కింద పడుతున్నామని దెబ్బలు తగులుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు నుంచి ఫ్లోరిన్ నీరు తాగాలంటే ఇబ్బందిగా ఉందని, వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. వంట గది లేకపోవడంతో ఆరు బయట వంట తయారు చేస్తున్నారు. దీంతో మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల ముందు మురుగు నీరు నిల్వ లేకుండా, వంట గదిని, పాఠశాలకు గోడ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రహరి లేని ఎంపీపీ పాఠశాల


కర్రోల ఎంపీపీ పాఠశాల ఆవరణంలో నిలిచిన మురుగు


ఎమ్మెల్యే బూచేపల్లిని సన్మానిస్తున్న మండల నాయకులు

ఎమ్మెల్యే బూచేపల్లికి సన్మానం

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శిగా ఎన్నికైన భీమని సుబ్బారావు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూచేపల్లి సూచించారు. కార్యక్రమంలో అడ్వకేట్ భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, గంగమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పూనూరి దేవదానం, సీనియర్ నాయకులు గూడా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె సూచన

మార్కాపురం: ఇటీవల పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సూచించారు. గత ప్రభుత్వంలో మనం చేసిన మంచిని ప్రజలకు వివరించాలని, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ మార్కాపురం మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన బూదాల గురవయ్య, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడిగా నియమితులైన ఏరువ వెంకటేశ్వరరెడ్డి ఆదివారం అన్నా, జంకెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పి.చెంచిరెడ్డి, శివరాంపురం సర్పంచ్ డి.నాదగురుబ్రహ్మం, నల్లబోతుల కొండయ్య, గౌస్ మొహిద్దీన్, మందటి శివారెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

- జగనన్న పాలన కోసం ప్రజలంతా ఎదురుచూపులు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని త్రిపుర సుందరీపురం గ్రామంలో పోలేరమ్మ నెల పొంగళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమానికి వెళ్లినా ప్రజలు వేలాదిగా తరలివస్తున్నారన్నారు. ఏడాది కాలంలో చంద్రబాబు చేసింది ఏం లేదని, ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలంతా భారీగా తరలివస్తున్నారన్నారు. గిట్టుబాటు ధరలు అందక రైతులు అల్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. ఏటా రైతుల ఖాతాల్లో పెట్టుబడికి రైతు భరోసా ఇవ్వడంతో రైతులకు ఏం ఇబ్బంది లేకుండా సాఫీగా పంటలు సాగు చేశారన్నారు. పంట నష్టపోయినా ఇబ్బంది లేకుండా వారి పేరుపై ప్రభుత్వమే బీమా చెల్లించిందని తెలిపారు. దీంతో పంట నష్టపోయినా మిరప, కంది తదితర తదితర పంటలకు పార్టీలకు అతీతంగా లక్షల రూపాయలు రైతుల ఖాతాలకు చేరాయన్నారు. అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు...ఇప్పటికీ రెండో ఏడాది వచ్చినా పైసా కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. ఓ పక్క గిట్టుబాటు ధరలు లేక, మరో పక్క ప్రభుత్వ సాయం అందక రైతులంతా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్నను సీఎం చేసుకుందామని రైతులంతా వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్తులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికుల వేతనం పెంచాలి

- నిరవధిక సమ్మెలో కార్మికుల డిమాండ్


సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బందికి గత ఏడేళ్లుగా వేతనం పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. ఆదివారం నుంచి మున్సిపల్ కాంట్రాక్టు ఇంజినీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిత్యావసర సరుకులతోపాటు అన్ని ఖర్చులు పెరిగాయని, అందుకు అనుగుణంగా వేతనం ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు సమానంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా వేతనం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు ఆర్థిక సాయంతోపాటు విశ్రాంత కార్మికులకు పింఛను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పది నెలలవుతున్నా పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, సలామ్, హరి, వెంకటేశ్వర్లు, శేఖర్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో ఊరేగిన పీర్లు


తర్లుపాడులో ఊరేగుతున్న పీర్లు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో పీర్ల పండగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను రంగు రంగుల పూలు, వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించి, మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులకు పప్పులు, బొరుగులు పంచిపెట్టారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


చిన్నారికి పీర్ల వద్ద ఆశీర్వాదం అందిస్తున్న తల్లిదండ్రులు


పెద్దదోర్నాలలో మొహర్రం సందర్భంగా ఊరేగుతున్న పీర్లు

- అట్టహాసంగా జరుపుకున్న భక్తులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వేడుకలను భక్తులు అట్టహాసంగా నిర్వహించుకున్నారు. వేడుకల సందర్భంగా పెద్దషరగత్‌ను శనివారం నిర్వహించుకున్నారు. ఆదివారం భారీ ఎత్తున్న పీర్లచావిడి వద్దకు చేరుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పీర్ల వద్ద తమ చిన్నారులకు దీవెనలు అందింపజేసుకున్నారు. మరికొందరు భక్తులు ముజావర్ల వద్ద తమ చిన్నారులకు ఎటువంటి కీడు జరుగకుండా ఉండాలని కోరుకుంటూ తాయెత్తులను కట్టించుకున్నారు. ఈసందర్భంగా కొందరు పీర్ల చావిడి వద్ద విచిత్ర వేషధారణలతో సందడి చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. పీర్లను మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి షహదత్ కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిధిలోని యడవల్లి, గంటవానిపల్లె, రామచంద్రకోట, చింతల అగ్రహారం, కటకానిపల్లె గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తులు ఉత్సాహ వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై మహేష్ చర్యలు చేపట్టారు.

భారీ గుంత.. ప్రయాణానికి చింత


రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత

కొమరోలు: అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులు, ప్రయాణికులను ప్రమాదంలోకి నెడుతోంది. కొమరోలు మండలం పామూరుపల్లి గ్రామ సమీపంలో శివాలయం ఎదురుగా ఉన్న ఈ గుంతను గమనించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి తీవ్రగాయాలపాలయ్యారు. పామూరుపల్లె గ్రామస్తులు గతంలో ఈ భారీ గుంతను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ అడపాదడపా కురిసిన వర్షాలతో పరిస్థితి మొదటికొచ్చింది. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి భారీ గుంతను పూడ్చించి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాల్లో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగా భవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. అంకాళమ్మ దేవతను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యం చెల్లించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించారు.


గుండంచర్ల గ్రామం సమీపంలో ప్రత్యేక అలంకరణలో కాటమరాజుస్వామి

పోలేరమ్మకు నెల పొంగళ్లు

దొనకొండ: మండలంలోని యర్రబాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలేరమ్మతల్లి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు నెల పొంగళ్ల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విశేష పూజలు చేశారు. గ్రామ దేవతలు పోలేరమ్మతల్లికి, బొడ్డురాయికి, పోతురాజుస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని గ్రామస్తులు గ్రామ దేవతలను వేడుకున్నారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కల్యాణం

మార్కాపురం: శ్రీలక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీవారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో సుమారు 150 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు